


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 11-11-2022 సంపుటి : 04 సంచిక : 72 పేజీలు : 4 వెల : రూ 3-00


# తెలుగు రాష్ట్రాల్లో మోడీ టూర్ కాక



హైదరాబాద్, నవంబర్ 10, ప్రధాని రాక తెలుగురాష్ట్రాల్లో కాకరేపుతోంది. ఓ వైపు ఏపీలో అధికారపార్టీ ప్రధాని మోదీ పర్యటనని ప్రభుత్వ పర్యటనగా మార్చేసేందుకు ప్రయత్నాలు చేస్తుంటే మరోవైపు తెలంగాణలో ఈసారైనా మోదీకి కెసిఆర్ వెల్‌కమ్ చెబుతారా లేదా అన్నదానిపై చర్చలు జరుగుతున్నాయి. అంతేకాదు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో మోదీ భేటీ ఉంటుందా? లేదా? అన్నదానిపై కూడా ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఏపీలో రాజకీయాలు ఎప్పుడూ ఏ రకంగా టర్న్ తీసుకుంటాయో ఎవరూ చెప్పలేరు. అంతేకాదు ఎవరు.. ఎప్పుడు.. ఎలా భేటీ అవుతారో ఎందుకు ఈ మీటింగ్ ఉంటుందో కూడా తెలియదు. ఇప్పుడలానే ప్రధాని మోదీ విశాఖ పర్యటన ఆసక్తిని రేపుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసేందుకు మోదీ ఈనెల 11న సాయంత్రం రానున్నారు. 11 వతేదీ రాత్రి ప్రధాని విశాఖ చేరుకోగానే రోడ్ షో నిర్వహిస్తారు. కంచెర్ల పాలెం నుంచి ఓల్డ్ ఐటీఐ వరకు 1కిలోమీటర్ల రోడ్ షో ఉంటుంది. రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకూ రోడ్ షో ఉంటుంది. 11 రాత్రి ఐఎన్ఎస్ చోళలో ప్రధాని బస చేస్తారు. 12న 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు. ఇందులో 152 కోట్లతో చేపట్టే విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ ముఖ్యమైంది. ఇది లక్షకుపైగా మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకురుతుంది. కోల్డ్ స్టోరీజీ, ఏసీ ఆక్షన్ హాల్, కొత్త జెట్టీల నిర్మాణం లాంటివి ఉన్నాయి. రాయ్‌పూర్-విశాఖ ఎకనామిక్ కారిడార్, విశాఖ రైల్వే స్టేషన్ ఆధునీకరణ, కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకూ డైరెక్ట్ రోడ్, గ్రెయిల్ ద్వారా శ్రీకాకుళం నుంచి ఒడిశాలోని వంగుల్ వరకూ పైప్ లైన్ నిర్మాణం, గుంతకల్లులో ఐవోసీఎల్ చేపడుతున్న ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చెయ్యనున్నారు.మోదీ విశాఖ పర్యటన బీజేపీ, వైసీపీ మధ్య తీవ్ర దుమారం రేపుతోంది. మొదట ఈ పర్యటనను వైసీపీ హైజాక్ చేస్తోందని ఆరోపించిన బీజేపీ ఇప్పుడు మరిన్ని అంశాలు తెరపైకి తెస్తోంది. అధికార పార్టీని ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. పెండింగ్ ప్రాజెక్టు పూర్తి కాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత విహంచాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇవ్వని కారణంగానే ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయంటున్నారు ఎంపీ జీవీఎల్. ఆయన మాటల్లో "విజయవాడ-నర్సాపూర్-భీమవరం-గుడివాడ-నిడదవోలు రైల్వే లైన్ డెవలప్ చెయ్యడం జరిగింది. దీనిలో 50 శాతం రాష్ట్రవాటా ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఆ ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. ఏపీలో మిగిలిన రైల్వే లైన్స్ అభివృద్ధి నిలిచిపోవడానికి కారణం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇవ్వక పోవడమే. కనీసం పీఎమ్ సమక్షంలోనైనా సీఎం జగన్ వీటికి హామీ ఇవ్వాలని కోరుతున్నా. ప్రధాని పర్యటనలో రాజధాని అంశం లేదు. కేవలం కేంద్ర ప్రభుత్వానికి చెందిన అంశాలే ఉంటాయి. రైల్వే జోన్‌ను ఆల్రెడీ ప్రకటన చేశాం. త్వరలో దీనిపై నిర్ణయం ఉంటుంది. రైల్వే జోన్‌పై ప్రత్యేకంగా వేరే ప్రకటన ఉంటుంది. ఇది అధికారిక పర్యటన కాబట్టి పవన్‌కి ఆహ్వానంపై పీఎంవో నిర్ణయం తీసుకుంటుంది. ప్రధాని విశాఖ పర్యటనను రాజకీయాల కోణంలో చూడొద్దు. రాజకీయ వ్యాఖ్యలు చేయొద్దు. హుందాతనాన్ని కోల్పోవద్దు (రిషికొండ చుట్టూ ప్రధాని రౌండ్ వెయ్యాలి అన్న టీడీపీ వ్యాఖ్యల పై) ప్రధాని ఒకటిన్నర రోజు విశాఖలో గడపడం అనేది వైజాగ్ ప్రజలకు ఎంతో గర్వకారణం" అని జీవీఎల్ పేర్కొన్నారు. విశాఖ అభివృద్ధికీ, బీజేపీ బలోపేతం కావడానికి పీఎం టూర్ టేకాఫ్ అవుతుంది కమలనాథులు భావిస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఇష్యు ఈ పర్యటనలో లేదు, మరోవైపు రైల్వే స్టేషన్ ఆధునీకరణ ఒకే కానీ రైల్వే జోన్ సంగతేంది అని విశాఖ వాసులు అడుగుతున్నారు. మోదీ పర్యటన షెడ్యూల్ మొత్తం అధికారక కార్యక్రమాలకే కేటాయించారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రారంభోత్సవాలకు ప్రధాని వస్తున్నారు కాబట్టి ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ప్రోగ్రాం అని జీవీఎల్ అంటున్నారు. ఈ పర్యటనను హైజాక్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రధాని వచ్చేది రాష్ట్రానికి, రాష్ట్ర ప్రభుత్వం ప్రోటోకాల్ ప్రకారం అన్నీ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఏపీ ప్రభుత్వం చెబుతోంది. బీజేపీ నేతలు మోదీని అధికారక కార్యక్రమాల్లో కలిసే వీలు లేకుండా ప్లాన్ చేస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది. ఏపీ కమలం నేతలు కూడా అధికారపార్టీకి పోటీగా వ్యూహరచన చేస్తున్నారు. మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యేందుకు పెద్దల ద్వారా చర్చలు జరుపుతున్నారు. మోదీ విశాఖ పర్యటన సందర్భంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా కలిసే అవకాశాలు లేకపోలేదన్న టాక్ వినపడుతోంది. ఇప్పటి వరకైతే ఇటు బీజేపీ అటు జనసేన నుంచి ఎలాంటి ప్రకటన లేదు. పొత్తుల విషయంగా ఇప్పటికే జనసేనతో కొనసాగుతామని బీజేపీ చెప్పినా పవర్ స్టార్ నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదు. అదీ కాకుండా ఈ మధ్యన సమయం వచ్చినప్పుడల్లా బీజేపీపై సెటైర్లు వేస్తున్నారు పవన్ కల్యాణ్. విశాఖ పర్యటన సందర్భంగా జరిగిన ఉద్రిక్తత పరిస్థితులతో చంద్రబాబు, పవన్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ విషయాన్ని ఇప్పటికే బీజేపీ నేతలు అధిష్ఠానం దృష్టికి తీసుకువచ్చారు. అందుకే ఇప్పుడు విశాఖ పర్యటనలో మోదీతో పవన్ భేటీ ఉంటుందన్న ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ఒకవేళ మోదీ, పవన్ కలిస్తే మాత్రం వైసీపీ తీరుపై ఫిర్యాదు కూడా చేసే అవకాశాలున్నాయని సమాచారం. విశాఖలో కలిసే వీలు లేకపోయినా హైదరాబాద్‌లో తప్పకుండా కలిసే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని ప్రధాని ప్రారంభించనున్నారు. ఈసారైనా ప్రధానికి తెలంగాణ సిఎం కెసిఆర్ స్వాగతం పలుకుతారా లేదా అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. గతంలో పలుమార్లు మోదీ వచ్చినా కానీ కెసిఆర్‌కు బదులు మంత్రి తలసాని ఆహ్వానించారు. కేసీఆర్ బీఆర్ఎస్ ప్రకటించిన తర్వాత తొలిసారిగా మోదీ తెలంగాణకు వస్తున్నారు.

# ఢిల్లీ మద్యం కుంభకోణం..

## మరో ఇద్దరు తెలుగువాళ్లు అరెస్టు




ఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దూకుడు పెంచింది. మద్యం వ్యాపారంతో సంబంధం ఉన్న మరో ఇద్దరిని అరెస్టు చేసింది.తెలుగు రాష్ట్రాలకు చెందిన పెనక శరత్ చంద్రారెడ్డి, మద్యం వ్యాపారి వినయ్‌బాబును అరెస్టు చేసినట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఇద్దరికి రూ.కోట్ల విలువైన మద్యం వ్యాపారం ఉందని ఈడీ పేర్కొంది. ఢిల్లీ మద్యం పాలసీకి అనుగుణంగా ఈఎండీలు చెల్లించినట్లు శరత్‌పై అభియోగాలున్నాయి. శరత్ చంద్రారెడ్డి అరబిందో గ్రూపులోని 12 కంపెనీలకు, ట్రైడెంట్ లైఫ్ సైన్సెస్ సంస్థలోనూ డైరెక్టర్‌గా ఉన్నారు.మద్యం కుంభకోణం కేసులో ట్రైడెంట్ లైఫ్ సైన్సెస్‌ను ఎఫ్ఆర్ఐలో గతంలో సీబీఐ ఎఫ్ఆర్ఐలో చేర్చింది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. దీనిలో భాగంగా సెప్టెంబర్ 21, 22, 23 తేదీల్లో ఢిల్లీలో శరత్ చంద్రారెడ్డిని ఈడీ అధికారుల ప్రశ్నించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీకి అనుగుణంగా ఈఎండీలను శరత్ చెల్లించారు. ఈ క్రమంలోనే ఆయన్ను విచారించిన ఈడీ.. గురువారం ఢిల్లీలో అరెస్ట్ చేసింది. ఈ కేసులోనే గతంలో హైదరాబాద్‌కు చెందిన రాబిన్ డిస్ట్రిబ్యూషన్ ఎల్ఎల్‌పీ డైరెక్టర్ బోయినపల్లి అభిషేక్‌ను సీబీఐ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

14 రోజుల కస్టడీ కోరిన ఈడీ

శరత్ చంద్రారెడ్డి, వినయ్ బాబులను ఈడీ అధికారులు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టుకు తీసుకెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఇద్దరినీ 14 రోజుల కస్టడీకి ఇవ్వాలని న్యాయమూర్తిని ఈడీ తరఫు న్యాయవాది కోరారు.

## ప్రధాని పర్యటన పేరిట కూల్చివేతలు

విశాఖపట్నం 15వేల కోట్లకు మించిన కేంద్ర పథకాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు ప్రధాని చేతుల మీదుగా జరగనున్నాయని బిజెపి జాతీయ కార్యదర్శి పురంధేశ్వరి తెలిపారు.ప్రధాని నిర్మాణం కోసం వస్తుంటే జగన్ సర్కారు మాత్రం ప్రధాని పర్యటన పేరిట కూల్చివేతలు సాగిస్తున్నారని,కనీసం నోటీసులు ఇవ్వకుండా, టైము ఇవ్వకుండా పేదల ఇళ్లు, షాపులు కూల్చారా అంటూ నిలదీశారు.భూకబ్జాలు చేసిన వారిమీద ఎందుకు అలా చర్యలు తీసుకోరని ప్రశ్నించారు.ఈ విధ్వంసానికి బెదిరిపోయి రాష్ట్రంలోకి పెట్టుబడిదార్లు రావటం లేదని,సీఎం రమేష్ మాట్లాడుతూ విశాఖ ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేస్తూ కబ్జాలు చేస్తున్నారని,ప్రధాని పర్యటనలో దొంగల హడావిడి ఎక్కువైందని వ్యాఖ్యానిచ్చారు.బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్ మాట్లాడుతూ విశాఖలోనూ, ఏపీలోనూ కేంద్రం ఎన్నో ప్రాజెక్టులు చేపడుతోందని,రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధికి ప్రధాని కృషి చేస్తున్నారని అన్నారు.

# ఢిల్లీ పొల్యూషన్.. అత్యవసర విచారణకు 'సుప్రీం' నో..



న్యూఢిల్లీ : దేశ రాజధానిలో వాయు కాలుష్యం ఇక్కట్లకు గురి చేస్తున్నది. దీపావళి తర్వాత కాలుష్యం తారాస్థాయికి చేరింది. ఈ క్రమంలో ఢిల్లీలో తీవ్ర కాలుష్యంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలవగా.. దీనిపై గురువారం విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. అత్యవసర విచారణకు నిరాకరించింది. ఎన్‌సీఆర్ పరిధిలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, వరి పొట్టు తగులబెట్టడాన్ని పూర్తిగా నిషేధించేలా ప్రభుత్వాలను ఆదేశించాలని పిటిషనర్ కోర్టును కోరారు.పొరుగు రాష్ట్రాల్లో వరి పొట్టు దహనం చేస్తుండడంతో దేశ రాజధానిని పొగ కమ్మేస్తుందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సీఐజే జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ హిమాకోహ్లి, జస్టిస్ జేబీ పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ.. ఈ అంశం కేవలం న్యాయవ్యవస్థ పరిధిలోకి రాదని పేర్కొంది.పంజాబ్, యూపీలోని ప్రతి రైతుపై ఆంక్షలు విధించవచ్చా? నిషేధం ఇందుకు సహాయపడుతుందా? అని కోర్టు పిటిషనర్‌ను ప్రశ్నించింది. కొన్ని కేసులను పరిశీలించవచ్చని.. కొన్ని కేసులు చేయలేవని.. ఎందుకంటే ఆ కేసులు న్యాయపరంగా బాధ్యత వహించవు అని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ తరఫున న్యాయవాది శశాంక్ శేఖర్ ఝా వాదనలు వినిపించారు. అంతకుముందు, ప్రత్యేక బెంచ్ నవంబర్ 10న విచారణను వాయిదా వేసింది. ప్రధాన కార్యదర్శులకు సమన్లు పంపేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు.

# ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొమ్మినేని శ్రీనివాసరావు

విజయవాడ: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా గురవారం బాధ్యతలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో మంత్రులు అంబటి రాంబాబు, వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మాణిక్యవరప్రసాద్, అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయ్ బాబు, తెలుగు అకాడమీ ఛైర్మన్ లక్ష్మీ పార్వతిలు పాల్గొన్నారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా కొమ్మినేని రెండేళ్ల పాటు పదవిలో కొమ్మినేని కొనసాగనున్నారు.



# ఏమీలేని దాని గురించి సినిమా స్క్రిప్ట్ రాస్తున్నారు: సజ్జల సీరియస్ కామెంట్స్



తాడేపల్లి: రాష్ట్రంలో గత నెలరోజులుగా ఏం జరుగుతుందో మనం చూస్తున్నాము. ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు.కాగా, క్యాంపు కార్యాలయంలో సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'విశాఖ గర్జణ రోజునే పవన్ అక్కడికి వచ్చారు. కావాలనే గందరగోళం సృష్టించారు. ప్రజలను మభ్యపెట్టేందుకు కుట్రలు చేస్తున్నారు. గత నెలరోజులుగా రాష్ట్రంలో ఏం జరుగుతుందో మనం చూస్తున్నాము. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని కూల్చేందుకు తాపత్రయపడుతున్నారు.ఇప్పటంపై టీడీపీ, జనసేన అనవసర రాద్ధాంతం చేస్తున్నాయి. ప్రభుత్వం ఆక్రమణలను కూల్చాలా..? వద్దా..?. ఏమీలేని దాని గురించి సినిమా స్క్రిప్ట్ రాస్తున్నారు. ఇప్పటంలో పవన్ అంత ఆవేశం ఎందుకు ప్రదర్శించారో అర్థం కావడంలేదు. రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందన్నట్టు క్రియేట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. చంద్రబాబు హయంలో మాయాబజార్ చూపించారు. ఇప్పటంలో గోడ కూడా కూల్చలేదు. చంద్రబాబు పాలనంతా కరువే. చంద్రబాబు హయంలో ఎప్పుడూ ధర్నాలే జరిగేవి. రాయితో దాడిచేశారని చంద్రబాబు డ్రామా చేశారు' అంటూ కామెంట్స్ చేశారు.

# సీఎం జగన్ విశాఖ పర్యటన..

విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖలో జరగనున్న పలు అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాల్లో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి పాల్గొంటారు.11వ తేదీ సాయంత్రం 6.15 గంటలకు గన్నవరం నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ఐఎన్ఎస్ డేగాకు చేరుకొని ప్రధానికి స్వాగతం పలుకుతారు.రాత్రి పోర్టు గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు. 12వ తేదీ ఉదయం 9.40 గంటలకు ఏయూ గ్రౌండ్‌లోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 10.20 గంటలకు ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతారు. 10.30 నుంచి 11.45 గంటల వరకు ప్రధానితో కలిసి పలు శంకుస్థాపనలు, ప్రాజెక్టుల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. 12.20కి ఐఎన్ఎస్ డేగాకు చేరుకొని ప్రధానికి వీడ్కోలు పలుకుతారు. 12.45లకు విశాఖ విమానాశ్రయం నుంచి గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరుతారు.



# సంపాదకీయం

శుక్రవారం 11-11-2022

## విలవిలాడుతున్న క్రిప్టో

క్రిప్టో మార్కెట్లు రెండు రోజులుగా విలవిల్లాడుతున్నాయి. ట్రేడర్లు, ఇన్వెస్టర్లు అమ్మకాలు చేపట్టారు. గత 24 గంటల్లో బిట్‌కాయిన్ 10.58 శాతం తగ్గి రూ.14.47 లక్షల వద్ద కొనసాగుతోంది. మార్కెట్ విలువ రూ.28.25 లక్షల కోట్లుగా ఉంది. బిట్‌కాయిన్ తర్వాత అతిపెద్ద మార్కెట్ విలువ కలిగిన ఎథీరియమ్ గత 24 గంటల్లో 17.29 శాతం తగ్గి రూ.1,00,597 వద్ద ట్రేడ్ అవుతోంది. మార్కెట్ విలువ రూ.12.35 లక్షల కోట్లుగా ఉంది.టెథర్ 1.80 శాతం తగ్గి రూ.80.57, యూఎస్‌డీ కాయిన్ 1.05 శాతం తగ్గి 81.01, బైనాన్స్ కాయిన్ 1.05 శాతం తగ్గి రూ.24,501, రిపుల్ 16.32 శాతం తగ్గి రూ.30.16, బైనాన్స్ యూఎస్‌డీ 1.84 శాతం తగ్గి రూ.80.54 వద్ద కొనసాగుతున్నాయి. స్టాసిస్ యూరో, పాక్స్ గోల్డ్, బెల్‌డెక్స్, యూరో టెథర్, మ్యాజిక్ ఇంటర్నెట్ మనీ, టెథర్ గోల్డ్ స్వల్ప లాభాల్లో ఉన్నాయి. ఎఫ్టీఎక్స్, కాయిన్ మెట్రో, సీరమ్, మరినేడ్ స్టేక్డ్ ఎస్‌ఓల్, సొలానా, హ్యాష్ ఫ్లో భారీగా పతనమయ్యాయి.క్రిప్టో కరెన్సీల ధరలు తెలుసుకోవడం ఇప్పుడు సులభమే. ఎక్కువ మంది వీటిపై పెట్టుబడులు పెడుతున్నారు. బిట్‌కాయిన్స్, ఎథిరెమ్, లైట్‌కాయిన్, రిపిల్, డోజీకాయిన్‌ను భారత్‌లో ఎక్కువగా ట్రేడ్ చేస్తున్నారు. ప్రతి రోజు వీటి ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతాయి. మార్కెట్ వొలటైల్‌గా ఉంటుంది. ఎక్కువగా వినిపించే బిట్‌కాయిన్, ఎథెర్, డోజీకాయిన్, లైట్‌కాయిన్, రిపిల్ ధరలు నిమిషాల్లోనే మారుతుంటాయి.క్రిప్టో కరెన్సీ ఒక డిజిటల్ అసెట్. ఇప్పుడున్న కరెన్సీ లాగే చాలా దేశాల్లో వీటిని లావాదేవీలకు అనుమతి ఇస్తున్నారు. కంప్యూటరైజ్‌డ్ డేటాబేస్ లెడ్జర్లలో ఈ కాయిన్లపై ఓనర్‌షిప్‌ను భద్రపరుస్తారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ద్వారా వీటిని తయారు చేస్తారు. ఈ క్రిప్టో కరెన్సీ భౌతికంగా కనిపించదు. అంతా డిజిటల్ రూపంలోనే ఉంటుంది. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీకి వీటికీ సంబంధం లేదు.భారత్‌లో క్రిప్టో కరెన్సీకి చట్టబద్ధత లేదు. అయితే ట్రేడింగ్ చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. లాభనష్టాలతో ప్రభుత్వానికి సంబంధం ఉండదు. పెట్టుబడి దారులే బాధ్యులు అవుతారు. ప్రజల్లో అవగాహన పెరగడంతో క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్‌లు, ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్, యాప్స్ చాలా అందుబాటులోకి వచ్చాయి.క్రిప్టో కరెన్సీని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని తెలిసింది. వాస్తవంగా శీతకాలం సమావేశాల్లోనే నియంత్రణ బిల్లును ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించారు. అయితే మరింత మంది నిపుణులు, స్టేక్ హోల్డర్లు, అనుభవజ్ఞుల సలహాలను తీసుకోవాలని నిర్ణయించింది. డిజిటల్ రూపాయి అనేది సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖీఃఎ ద్వారా జారీ చేయబడిన చట్టపరమైన కరెన్సీ, దీనిని సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ అని కూడా పిలుస్తారు. ఇది డిజిటల్ రూపంలో మాత్రమే ఉంటుంది. డిజిటల్ రూపాయి లేదా కరెన్సీ అనేది డిజిటల్ రూపంలో జారీ చేయబడిన కరెన్సీ, ఇది ఎలక్ట్రానిక్ రూపంలో కాంటాక్ట్‌లెస్ లావాదేవీలకు ఉపయోగించబడుతుంది.భారతదేశంలో డిజిటల్ కరెన్సీ అంటే ఇ-రూపాయి రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది హోల్‌సేల్ డిజిటల్ కరెన్సీ , రెండవది రిటైల్ డిజిటల్ కరెన్సీ . ప్రారంభంలో, ఇది పైలట్ ప్రాజెక్ట్ కింద హోల్‌సేల్ విభాగంలో ప్రవేశపెట్టారు.. అదే సమయం లో, ఇది కొంతకాలం తర్వాత రిటైల్ విభాగంలో కూడా ప్రారంభమవు తుంది.క్రిప్టో కరెన్సీ కూడా డిజిటల్ కరెన్సీ, ఇది క్రిప్టోగ్రఫీ ద్వారా భద్రపరచబడుతుంది. క్రిప్టోకరెన్సీ అనేది నెట్‌వర్క్ ఆధారిత డిజిటల్ కరెన్సీ, ఇది బ్లాక్‌చెయిన్‌పై ఆధారపడి ఉంటుంది. దీని పంపిణీ విస్తృతమైన కంప్యూటర్ల నెట్‌వర్క్ ద్వారా జరుగుతుంది. ప్రపంచంలోని అన్ని కరెన్సీలు ఏదో ఒక దేశంచే జారీ చేయబడినప్పటికీ, క్రిప్టో కరెన్సీపై ఏ ఒక్క దేశం లేదా ప్రభుత్వం నియంత్రణ ఉండదు. క్రిప్టో కరెన్సీకి సంబంధించి, బ్లాక్‌చెయిన్ కారణంగా, ఈ కరెన్సీకి సంబంధించిన అనేక సమస్యలు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు.ఇ-రూపాయి కూడా ఒక రకమైన డిజిటల్ కరెన్సీ , ఇందులో కూడా క్రిప్టోకరెన్సీ వంటి డిజిటల్ మాధ్యమం ద్వారా లావాదేవీ జరుగుతుంది. అయితే, ఈ రెండింటి మధ్య అతిపెద్ద వ్యత్యాసం ఏమిటంటే డిజిటల్ రూపాయిని ఆర్బీఐ నియంత్రిస్తుంది. అంటే, దానిని నియంత్రించడానికి చట్టపరమైన అధికారం ఉంది, దానిని ప్రభుత్వం ఆమోదించింది. అందుకే ఇది చట్టబద్ధమైన కరెన్సీ. ఇందులో, రిజర్వ్ బ్యాంక్ నియంత్రణలో , ఇతర బ్యాంకులు లావాదేవీని సులభతరం చేయడానికి జవాబుదారీగా ఉంటాయి. అయితే, క్రిప్టోకరెన్సీలలో ఇదంతా ఉండదు.కాకుండా, డిజిటల్ రూపాయి విలువ క్రిప్టో కరెన్సీ లాగా అకస్మాత్తుగా హెచ్చుతగ్గులకు గురికాదు. గతంలో రిజర్వ్ బ్యాంక్ క్రిప్టో కరెన్సీకి వ్యతిరేకమని ప్రకటించింది. దీని వినియోగం వల్ల ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లడం ఆర్బీఐ గవర్నర్ కు ఇష్టం లేదు. క్రిప్టో కరెన్సీని కొనుగోలు చేసి విక్రయించే పెట్టుబడిదారులు కూడా భానష్టాలను ఎదుర్కొంటున్నారని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. క్రిప్టోలను పూర్తిగా నిషేధిస్తారని మొదట్లో వార్తలు వచ్చినా.. క్రిప్టో అసెట్, నియంత్రణ బిల్లును తీసుకొస్తున్నారని తెలిసింది.

# నిన్న గుంటూరు.. ఇవాళ అనంతపురం

అనంతపురం, నవంబర్ 10, జగన్ పార్టీలో విభేదాలు ముదిరి పాకాన పడ్డాయి. పార్టీ జిల్లా అధ్యక్ష పదవులకు సీనియర్లు వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. పార్టీ పరువు బజారున పడకండా ఉండేందుకు రాజీనామాల ప్రకటన వద్దని వైసీపీ అగ్రనాయకత్వం బుజ్జగింపులను కూడా వినే పరిస్థితుల్లో సీనియర్లు లేరు. పార్టీ ప్రతిష్ట మంటగలిసినా బేఫికర్ అంటూ తమ అసమ్మతి గళాన్ని విప్పుతున్నారు. వారిలో అసంతృప్తి ఎంతగా గూడు కట్టుకుందంటే.. తమ రాజీనామాతో హైకమాండ్ ను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశమే ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.పార్టీలో అసమ్మతి జ్వాలలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయన్న వార్తలు చాలా కాలంగానే వినవస్తున్నాయి. వైసీపీ శ్రేణులు కూడా ఆ విషయాన్ని రహస్యంగా ఉంచేందుకు ఏమీ పెద్దగా ప్రయత్నించలేదు. జగన్ ఎప్పుడైతే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేశారో.. నాటి నుంచే వైసీపీ అప్పటి దాకా మూసి ఉంచిన గుప్పెట తెరిచేసినట్లైంది. జగన్ మాటే వేదం, ఆయన నిర్ణయమే శిరోధార్యం అంటూ పార్టీలో అప్పటి దాకా ఉన్న బిల్డప్ కేబినెట్ పునర్వ్యవస్థీకరణ తరువాత మటు మాయమైంది. బహిరంగంగా నిరసనలు వెల్లువెత్తాయి, జగన్ స్వయంగా బుజ్జగింపులకు దిగాల్సిన పరిస్థితి వచ్చింది. సరే ఎలాగో అప్పటికి పరిస్థితి సద్దుమణిగినా.. అప్పటి నుంచి వైసీపీలో అసమ్మతి జ్వాలలు నివురుగప్పిన నిప్పులా అలాగే ఉన్నాయి.అనంతపురం జిల్లా పార్టీ అధ్యక్ష పదవికి కాపు రామచంద్రారెడ్డి రాజీనామా చేశారు. ఇక ఆయన స్థానంలో మరొకరిని నియమించాలన్నా ఎవరూ ముందుకు రాని పరిస్థితి నెలకొని ఉంది. కానీ ఈ పరిస్థితి ఒక్క అనంతపురం జిల్లాకే పరిమితం కాలేదని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్ష పదవికి మాజీ మంత్రి సుచరిత రాజీనామా చేశారు. ఇదే దారిలో పలు జిల్లాల అధ్యక్షులు ఉన్నారని చెబుతున్నారు. వైసీపీ పార్టీ జిల్లా అధ్యక్ష పదవులను ఒక బుజ్జగింపు విధానంగా మార్చింది. తొలి సారి మంత్రివర్గం నుంచి ఉద్వాసనకు గురైన వారికీ, అలాగే మంత్రిపదవులు ఆశించి రానివారికీ తాయిలం ఇచ్చినట్లుగా జిల్లా అధ్యక్ష పదవులను కట్టబెట్టింది.మీమీ జిల్లాలలో పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటే ఆ అభ్యర్థికి మంత్రి పదవి గ్యారంటే అని జగన్ బంపరాఫర్ కూడా ఇచ్చారు. అంటే జిల్లా అధ్యక్షులకు అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే అవకావం ఉండదు.. ఎవరినో గెలిపించడానికి, వారికి మంత్రిపదవి ఇప్పించడానికి కష్టపడాలా అన్న భావన వారిలో నెలకొంది. ఈ కారణంగానే పార్టీ పదవులంటే వద్దు బాబోయ్ అని పారిపోయే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నది.ఫ్రస్టేషన్ లో వైసీపీ నేతలుఒక ఎమ్మెల్యే అధికారులపై మండిపడతారు. మరో ఎమ్మెల్యే మహిళలను వెటకారం చేస్తారు. ఇంకో ఎమ్మెల్యే బూతులే స్తోత్రాలు మాదిరిగా మాట్లాడతారు. ఒక ఎమ్మెల్యే ప్రజల్ని ప్రాంతీయ విభేదాలతో రెచ్చగొడతారు. ఇంకొకరైతే రాజీనామా పేరుతో ఒక డ్రామాకు తెరలేపుతారు. ఒక మహిళా ఎమ్మెల్యే.. ఇప్పుడు మంత్రిగా ఉండి కూడా 'మధ్య వేలు' చూపించి మరీ యువతను రెచ్చగొడతారు. మరో ఎమ్మెల్యే, ప్రస్తుత మాజీ మంత్రి చొక్కా చేతులు మడతపెట్టి రౌడీలా రంకెలు వేస్తారు. మరో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే అయితే.. ప్రతి మాటలోనూ వెటకారం నింపకుండా మాట్లాడరు. వైసీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి అయితే.. బిల్డప్ ల మీద బిల్డప్ లు ఇస్తుంటారు. వీరందరి 'ముఖ్య' నాయకుడు వారెవరినీ నియంత్రించే పనే చేయరు. పైగా వారిని 'గడప గడపకు మన ప్రభుత్వం' పేరుతో జనం మధ్యకు పంపిస్తుంటారు. ఇదండీ.. ప్రస్తుతం ఏపీలోని కొందరు వైసీపీ ఎమ్మెల్యేలు, వారి ముఖ్య నేత తీరు.వైనాట్ 175 అవుటాఫ్ 175 వైసీపీ అధినేతకు ఇప్పుడు పట్టుకున్న పిచ్చి ఇది. గత ఎన్నికల్లో 151 స్థానాల్లో వైసీపీని గెలిపించి, తమ నెత్తి మీదకు తెచ్చుకున్న ఆంధ్రా జనం వచ్చే ఎన్నికల్లో మొత్తం స్థానాల్లో జగన్ పార్టీని గెలిపించాలట. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షానికి ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది. ప్రతిపక్షం అనేదే లేకపోతే అధికార పార్టీకి కళ్లెం వేసేవారు ఎవరుంటారసలు? మొత్తానికి మొత్తం సీట్లలో వైసీపీయే గెలిచేస్తేనే.. తన అధికారదాహం తీరుతుందని ఆ పార్టీ అధినేత అనుకుంటున్నారా? అని జనం నుంచి ప్రశ్న వస్తోంది. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ తన నేతృత్వంలో రాష్ట్రాన్ని ఇప్పటికే అదఃపాతాళానికి నెట్టేశారనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి ఆమడదూరం పోయింది. రోడ్ల దుస్థితి చూస్తే ముక్కున వేలేసుకోక తప్పదు. ఖజానా ఖల్లాస్ అయిపోయింది. రాజధాని ఏదంటే చెప్పుకోలేని పరిస్థితి రాష్ట్ర ప్రజలకు అవమానంగా మారింది. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా జగన్ రెడ్డి ఏవేవో పనికిమాలిన పనులు చేస్తున్నారనే విమర్శలు ఎక్కువయ్యాయి. గత ఎన్నికల ముందు జగన్ గొప్పగా చెప్పిన 'నవరత్నాలు' 'నవ ద్రోహాలు'గా మారాయంటూ పలువురు దుమ్మెత్తిపోస్తున్నారు.రాష్ట్రాన్ని, ప్రజల్ని అప్పుల ఊబిలోకి నెట్టేసినా వచ్చే ఎన్నికల్లో వైసీపీకి మొత్తం ఎమ్మెల్యే స్థానాల్లో, ఎంపీ సీట్లలో విజయం సాధించాలట. లేదంటే సిటింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీల సీట్లకు ఎసరు తప్పదని, వారి స్థానాల్లో కొత్తవారికి అవకాశం ఇస్తానని జగన్ రెడ్డి ప్రతి సందర్భంలోనూ వారిని బెదిరిస్తుండడం గమనార్హం. ఇప్పుడు వైసీపీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల చెవుల్లో తమ అధినేత వార్నింగే 'రింగ్ రింగ్'మంటూ మోగుతోంది. వచ్చే ఎన్నికల్లో తమకు సీటు దక్కే ఛాన్స్ లేదనుకుంటున్న కొందరు ఎమ్మెల్యేలైతే.. అవకాశం లేని చోట ఎంత కష్టపడి ఏమి లాభం అనుకుని నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నారు. పార్టీని ఎలా గెలిపించాలి? తనను ఎన్నుకున్న ప్రజల కోసం ఎలాంటి కార్యక్రమాలు చేయాలనే దాని కంటే.. మళ్లీ ఎలా సీటు సంపాదించాలనే అంశంపైనే మల్లగుల్లాలు పడుతున్నారని ఊహాగానాలు వస్తున్నాయి.ఒక పక్కన సొంతంగా చేయించుకుంటున్న సర్వేల నివేదికలు, ఇంకో పక్కన 'ఐ ప్యాక్' బృందం తరచుగా అందజేస్తున్న సర్వే ఫలితాలు జగన్ ను గందరగోళంలో పడేస్తున్నాయంటున్నారు. అయినప్పటికీ ఆయన 'బురదపాము కోపం' మాదిరిగా తన పార్టీ ఎమ్మెల్యేలపై కస్సుబుస్సులాడుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఏతా వాతా వచ్చే ఎన్నికల్లో వైసీపీకి భంగపాటు తప్పదనేది వాస్తవం అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయినా సరే 'నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు' చందంగా తనకు 175 సీట్లు వచ్చి తీరాలనే పంతానికి జగన్ పోతుండడం గమనార్హం. ఆ క్రమంలోనే తన సిటింగ్ ఎమ్మెల్యేలను జనంలోకి తోస్తుండడం విశేషం. పోనీ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసీపీ ఎమ్మెల్యేలను స్థానిక ప్రజలు ఏమైనా గౌరవిస్తున్నారా? అంటే అలాంటిదేమీ లేదు. పైగా ముఖం మీదే వారిని సమస్యలపై కడిగిపారేస్తున్న సంఘటనలు జరుగుతున్నాయి.

# విశాఖలో కూల్చివేతలు

విశాఖపట్టణం, నవంబర్ 10, విశాఖ పట్నంలో భూముల వివాదాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఓ వైపు దసపల్లా, రేడియంట్, విజయసాయిరెడ్డి కుమార్తెకు చెందిన కంపెనీ భూములు అంటూ అనేక రకాల ఆరోపణలు వస్తున్నాయి. మరో వైపు పేదలు దశాబ్దాలుగా ఉంటున్న కొన్ని స్థలాలను ప్రభుత్వానివిగా గుర్తించి రాత్రికి రాత్రి అందులో ఉన్న ఇళ్లను నేలమట్టం చేస్తున్నారు. ఆ ఇళ్లలోని వారికి నోటీసులు ఇవ్వడం కాదు కదా.. కనీసం సామాన్లు తీసుకునే అవకాశం కూడా ఇవ్వడం లేదు. దీంతో విశాఖ వాసులు ఎప్పుడు తమ ఇంటిపైకి జేసీబీ వస్తుందోనని బిక్కుబిక్కుమంటున్నారు. విశాఖలోని బాపన అప్పారావు దిబ్బ గురించి అందరికీ తెలుసు. అందులో దుకాణాలు ఉంటాయి. దాదాపుగా యాభై ఏళ్లుగా అక్కడ దుకాణాలు ఉంటాయి. అయిదే ఆ బాపన అప్పారావు దిబ్బలో ఉన్న దుకాణాలను రాత్రికి రాత్రే అధికారులు కూల్చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటనకు వస్తున్నారని.. వాహనాల పార్కింగ్‌కు ప్రదేశం అవసరం అయిన కారణంగా ఆ దిబ్బను ఖాళీ చేయిస్తున్నామని అధికారులు చెప్పి మొత్తం కూలగొట్టేశారు. ప్రధానమంత్రి నగరానికి వస్తే పార్కింగ్ బాపన అప్పారావు దిబ్బ మీదే చేయాలని ఎందుకు అనుకున్నారో కానీ.. పేదల నివాసాలు.. దుకాణాలు మాత్రం ఖాళీ అయిపోయాయి. దీంతో పలువురు రోడ్డున పడ్డారు. బాపన అప్పారావు దిబ్బ స్థలంపై కొన్నాళ్ల కిందటి వరకూ వివాదం ఉంది. అది ఆంధ్రా యూనివర్శిటీ స్థలం అని ఏయూ వర్గాలు చెబుతూ ఉంటాయి. అయితే దీనిపై సుదీర్ఘమైన న్యాయపోరాటం జరిగింది. 1954 నుంచి రెండు వర్గాల మధ్య న్యాయపోరాటం జరగింది. చివరికి సుప్రీంకోర్టు 2011 లోనే తమకు డిక్రీ ఇచ్చిందని బాపన అప్పారావు చెబుతున్నారు. ఎకరం పైన గల తమ స్థలంలో ఇక్కడి షాపులను అద్దెకు ఇచ్చి బతుకుతున్నామని.. ప్రధాని పర్యటన లో కార్ పార్కింగ్ అంటూ దుకాణాలు తొలగించారని.. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని వారు వాపోతున్నారు ఆంధ్ర యూనివర్సిటీ వీసీ ఈ స్థలాన్ని యూనివర్సిటీ స్థలం అంటున్నారని కానీ అది అవాస్తవం అని చెబుతున్నారు రాత్రికి రాత్రి దుకాణాలు తొలగించడం తో తాము అన్యాయం అయిపోయామని అంటున్నారు.దసపల్లా భూములను సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందునే ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చామని విజయసాయిరెడ్డి ప్రకటించారు. ఇవ్వకపోతే సుప్రీంకోర్టు ధిక్కరణ అవుతుందన్నారు. కానీ బాపన అప్పారావు దిబ్బ విషయంలో మాత్రం సుప్రీంకోర్టు డిక్రీ ఇచ్చిందని బాధితులు ఆరోపిస్తున్నారు. అయినా కూలగొట్టారని అంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో పేదల ఇళ్లపై విరుచుకుపడుతున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. దుకాణాలు తొలగించిన ప్రాంతాన్ని టీడీపీ నేతలు సందర్శించి బాధితులు పక్షాన న్యాయ పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ వివాదం రాజకీయ దుమారం రేపే అవకాశం కనిపిస్తోంది.

## మళ్లీ రోడ్లపైకి టమాటా



తిరుపతి, నవంబర్ 10, రోజురోజుకు టమాటా ధర పడిపోతోంది. దీంతో టమాటా రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ వ్యవసాయ మార్కెట్ లో బుధవారం టమాటా ధర అమాంతం పడిపోయింది. నిన్న, మొన్నటి దాకా కిలో రూ.5 పలికిన టమాటా 50 పైసలకు పడిపోయింది. పెట్టుబడి కూడా రావడం లేదని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిలో టమోటా 50 పైసలు పలకడంతో కూలీ, రవాణా ఖర్చులు కూడా రావడం లేదంటూ రైతుల ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్‌లోనే టమోటాను రైతులు పారబోశారు. తమకే ఎదురు ఖర్చులు పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను కోసి మార్కెట్‌కు తరలిస్తుంటే ట్రాన్స్‌పోర్టు చార్జీలు కూడా రావడం లేదంటున్నారు.పంట సాగు చేపట్టే ముందు ధర ఎక్కువగా ఉందని, అధిక సంఖ్యలో సాగు చేపట్టామని, తీరా పంట చేతికొచ్చే సమయానికి పూర్తిగా ధర పతనమై నష్టాపోతున్నామని రైతులు వాపోతున్నారు. మూడేళ్ల క్రితం పత్తికొండ మార్కెట్‌లో ధరలు పడిపోయిన సమయంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులను ఆదుకుంటామని ప్రకటన చేశారు. అయితే ఆ హామీని అమలు చేయకపోవడంతో గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా టమాటా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# సింహపురిలో శాండ్ మాఫియా

నెల్లూరు, నవంబర్ 10,ఏపీలో చాలా చోట్ల ల్యాండ్ మాఫియా రెచ్చిపోతోంది. నెల్లూరులో ల్యాండ్ మాఫియాతోపాటు శాండ్ మాఫియా కూడా ఎక్కువే. నెల్లూరులో ప్రధానంగా పెన్నా నది ఇసుక మంచి ఆదాయ వనరుగా ఉంది. ప్రభుత్వ అధీనంలో ఇసుక ఉన్నప్పుడు, గతంలో టీడీపీ హయాంలో ఉచిత ఇసుక తవ్వకాలకు అనుమతి ఉన్నప్పుడు కూడా శాండ్ మాఫియా జోరుగా సాగేది. కానీ ఇప్పుడు మరింత ముదిరిపోయింది. పొరుగున ఉన్న తమిళనాడు రాష్ట్రానికి ఇసుక అక్రమంగా రవాణా చేస్తే భారీ ఆదాయం వస్తుంది. అందుకే ఈ సులభమైన మార్గాన్ని ఎంపిక చేసుకున్నారు కొంతమంది అక్రమార్కులు.వైసీపీ హయాంలో ఇసుకను పూర్తిగా కాంట్రాక్ట్ సంస్థలకే అప్పగించడంతో మరింత దారుణంగా ఉంది పరిస్థితి. పెన్నా పరివాహక ప్రాంతం నుంచి వేలాదిగా టిప్పర్లతో ఇసుకను తరలిస్తున్నారు. రాత్రిపూట ఇసుక తవ్వకాలపై నిషేధం ఉన్నా కూడా అక్రమ రవాణా ఆగకపోవడం విశేషం. నెల్లూరు నగరం మధ్యలో నుంచి ఇలాంటి ఇసుక లారీలు అర్థరాత్రి వెళ్తున్నా కూడా ఎవరూ పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.నెల్లూరు జిల్లా జొన్నవాడ సమీపంలోని మినగల్లు ఇసుక రీచ్ నుంచి రాత్రిళ్లు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే సామాన్యులెవరూ దీనిపై ఫిర్యాదు చేయకపోవడంతో అధికారులు కూడా చూసీ చూడనట్టు ఉంటున్నారు. పైగా దీనిలో రాజకీయ జోక్యం కూడా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. నిత్యం వందల లారీల్లో రాత్రిపూట ఇసుక తరలి వెళ్తున్నా ఎవరూ పట్టించుకోవట్లేదని తెలుస్తోంది.నెల్లూరు జిల్లాలో ఇసుక రీచ్ నిర్వాణ బిడ్ ధర 21 కోట్ల రూపాయలు. అంత భారీ మొత్తంలో డబ్బు వెనక్కి రావాలంటే రాత్రింబవళ్లు పనులు జరగాల్సిందే. అందులోనూ ఇటీవల పెన్నమ్మకు తరచూ భారీ స్థాయిలో వరదనీరు వస్తోంది. దీంతో వరద తగ్గిన వెంటనే ఇసుకను రీచ్ ల లోకి తరలిస్తున్నారు. అక్కడినుంచి రాత్రి పగలు అనే తేడా లేకుండా టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారు.కొన్ని చోట్ల స్థానికులే రాత్రిపూట జరిగే ఇసుక దందాను అడ్డుకున్నట్టు తెలుస్తోంది. దీంతో అప్పటికప్పుడు లారీలను ఆపేస్తున్న కాంట్రాక్టర్లు తెల్లవారు జామునుంచే ఇసుక రవాణా తిరిగి ప్రారంభిస్తున్నట్టు తెలుస్తోంది. నెల్లూరు జిల్లాలో ముదివర్తి, నాగరాజుతోపు, మినగల్లు, పీకేపాడు రీచ్ లలో ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇసుక టన్ను రూ.475కు విక్రయించాలని నిబంధనలున్నాయి. జిల్లాలోని పది ఓపెన్ రీచ్ లలో.. ప్రస్తుతం తవ్వకాలకు అనుమతిచ్చింది కేవలం 7.25 లక్షల టన్నులు మాత్రమే. మూడు నెలలుగా తవ్వకాలు జరుగుతుండటంతో ఇంతకంటే ఎక్కువగానే తరలించాలని అంటున్నారు. అనుమతులకు మించి తవ్వకాలు జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.గనుల శాఖ ఏడీ శ్రీనివాసరావు ఈ వ్యవహారంపై సీరియస్ గా స్పందించారు. నిబంధనల ప్రకారం రాత్రిపూట తవ్వకాలు చేపడితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారాయన. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్న రీచ్ లలో తనిఖీలు చేపడతామని అన్నారు. అక్రమంగా తవ్వకాలు చేపట్టినా, రాత్రిపూట తవ్వకాలు, రవాణా చేపట్టినా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## బాలయ్యకు పోటీగా మధుమతి

అనంతపురం, నవంబర్ 10,హిందూపురం స్థానం అంటే నందమూరి ఫ్యామిలీ అడ్డా అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. వైఎస్సార్ ఫ్యామిలీకి పులివెందుల ఎలాగో..నందమూరి ఫ్యామిలీకి హిందూపురం అలా. ఇక్కడ 1983 నుంచి వరుసగా టిడిపి గెలుస్తూనే వస్తుంది. ఎన్టీఆర్, హరికృష్ణ, బాలకృష్ణ సత్తా చాటుతూనే ఉన్నారు. గత రెండు ఎన్నికల్లో బాలయ్య మంచి మెజారిటీలతో గెలిచారు. ఈ సారి కూడా గెలుపు దిశగానే వెళుతున్నారు. తాను అందుబాటులో లేకపోయినా సరే..ఎప్పటికప్పుడు హిందూపురంలో సమస్యలు పరిష్కరించేలా పనిచేస్తున్నారు.అధికారంలో లేకపోయిన సొంత డబ్బులు ఖర్చు పెట్టి పనులు చేయిస్తున్నారు. అందుకే హిందూపురంలో బాలయ్య బలం తగ్గలేదు. ఇక ఇక్కడ పైచేయి సాధించాలని వైసీపీ గట్టిగానే ట్రై చేస్తుంది. అధికార బలంతో స్థానిక సంస్థల్లో గెలిచారు గాని..ఓవరాల్ గా మాత్రం హిందూపురపై పైచేయి సాధించలేదు. పైగా ఇంచార్జ్‌గా ఉన్న ఇక్బాల్ చుట్టూ ఎప్పుడు వివాదాలే. ఆయన్ని సొంత పార్టీ నేతలే వ్యతిరేకించే పరిస్తితి.ఇదే క్రమంలో ఇటీవల చౌళూరు రామకృష్ణారెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. ఈయన జగన్ అభిమాని..గతంలో హిందూపురం వైసీపీ సమన్వయకర్తగా పనిచేశారు. వైసీపీలో ఉండే విభేదాల వల్లే ఆయన హత్య జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇక రామకృష్ణారెడ్డి హత్య తర్వాత..ఆయన కుటుంబం హిందూపురంలో యాక్టివ్ అయింది. రామకృష్ణారెడ్డి సోదరి మధుమతి హిందూపురంలో ఎంట్రీ ఇచ్చారు. ఎన్‌ఆర్‌ఐగా ఉన్న ఆమె..ఇకపై హిందూపురంలోనే ఉంటానని, ఇక్కడే ఇల్లు కూడా తీసుకుంటానని, ప్రజల్లో తిరుగుతానని ఇటీవల జగన్‌కు కూడా స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.వైసీపీ అధిష్టానం సైతం మధుమతికి ఇంచార్జ్ పదవి ఇవ్వడానికి చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మధుమతికి నియోజాకవర్గంలోని పలువురు ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు మద్ధతుగా నిలుస్తున్నారు. ఈ పరిణామాలని బట్టి చూస్తే ఇక ఇక్బాల్‌ని సైడ్ చేసి..హిందూపురం సీటు మధుమతికి ఇస్తారనే ప్రచారం వస్తుంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే హిందూపురంలో బాలయ్యపై మధుమతి పోటీ చేసే అవకాశాలు కూడా ఉన్నాయి.

# గ్రామీణాభివృద్ధే సియం వైఎస్ జగన్ లక్ష్యం



### అంగన్వాడీ సెంటర్ కు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

చింతకొమ్మదిన్నె (ఉదయం న్యూస్) నవంబర్ 10 : గ్రామీణాభివృద్ధే ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు బుధవారం చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని 16 వ డివిజన్ బలిజపల్లి లో స్థానిక కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ నాయకులు వార్డు ఇన్చార్జి నాగిరెడ్డి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రానికి, డ్రైనేజీ కాలువకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి భూమిపూజ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు, ఆరోగ్యానికి పెద్ద పీట వేసిందని చెప్పారు ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో కాలువలు, విద్యుత్, ఇళ్ళ స్థలాలు ఇవ్వడం జరిగుతోందన్నారు

# కాంగ్రెస్ నేతల పాదయాత్రలు..



విజయవాడ, నవంబర్ 10, ఏపీ పునర్ వ్యవస్థీకరణ పుణ్యమా అంటూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కనుమరుగైన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడిప్పుడే కాంగ్రెస్ పార్టీకి కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేసింది. అలాగే లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా పోటీ చేసింది. అయితే ఓట్లు పడవని అనుకున్నారు. కానీ చాలా చోట్ల ఇండిపెండెంట్ల కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆశలు రేకెత్తుతున్నాయి. మరో ఏడాదిన్నరలో రాష్ట్రంలో ఎన్నికలు ఉండటంతో నాయకులంతా పోటీ చేసేందుకు ఉత్సుకత చూపుతున్నారు. ఇప్పటి నుంచే కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై నేతలు దృష్టి పెట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేసేందుకు సిద్ధమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకత విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. డిసెంబర్ తొలి వారం నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ రెడీ చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులంతా కలిసి పని చేసేలా నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీ విభజన సమస్యలపై ఉద్యమాలు ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఏపీకి ప్రత్యేక హోదాపై నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు రెడీ అయ్యారు. తాము అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ హామీ ఇవ్వడంతో బీజేపీ ని గట్టిగా డిమాండ్ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో సమావేశం ఏర్పాటు చేసిన పీసీసీ చీఫ్ శైలజానాథ్. కాంగ్రెస్ నాయకులతో తమ పాదయాత్రపై చర్చించారు. రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్రలో పాదయాత్ర చేయాలని సూచించారు. అలాగే రాష్ట్రానికి ప్రధాని మోదీ వస్తుండటంతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ నెల 12న మోదీ ఏపీలో పర్యటించనుండటంతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్ కేడర్‌కు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాలతోనైనా కాంగ్రెస్ పార్టీని ఏపీ ప్రజలు ఆదరిస్తారేమో చూడాలి

# ఏపీలో మాయమవుతున్న చిన్నారులు

తిరుపతి, నవంబర్ 10, (నూదువుతున్న ముగ్గురు బాలికలు, ఇద్దరు బాలురు అదృశ్యం అయ్యారు. గుణశ్రీ, మెహతాజ్, మౌనశ్రీ, అబ్దుల్ రెహ్మాన్ పదో తరగతి చదువుతుండగా.. అతీఫ్ హుస్సేన్ 9వ తరగతి చదువుతున్నారు. ఉదయం 6 గంటలకు స్టడీ అవర్స్ అంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లిన విద్యార్థులు... ఉదయం 8 గం.లకు టిఫిన్ చేసేందుకు ఇంటికి బయలుదేరారు. ఇంటికి వెళ్తూ దారి మధ్యలో నలుగురు కలిసి ఎటో వెళ్లిపోయారు. ఎంతకీ పిల్లలు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులుల బడికి ఫోన్ చేశారు. పిల్లలు చాలా సేపటి క్రితమే బడి నుంచి వెళ్లిపోయారని చెప్పగా పిల్లలను వెతకడం ప్రారంభించారు. స్నేహితులు, తెలిసిన వాళ్ల ఇళ్లలో వెళ్లి చూడగా ఆచూకీ లభించలేదు. దీంతో పిల్లలకు ఏమైపోయిందో అని భావించిన తల్లిదండ్రులు వెంటనే పోలీసుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసుకున్న తిరుపతి వెస్ట్ జోన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పిల్లలు కనిపించకపోవడానికి గల కారణాలు ఏంటో తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఓ వైపు బడిలోని తోటి పిల్లలను విచారించారు. మరోవైపు సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అయితే అదృశ్యమైన విద్యార్థులంతా గత రెండు రోజుల నుంచి తిరుపతి నుంచి బయటకు వెళ్లిపోయేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తి విషయాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది..విశాఖపట్నంలో కూడా ఈ మధ్య నలుగురు విద్యార్థులు అదృశ్యమయ్యారు. తమ కోసం వెతకొద్దని లెటర్ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయారు. తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసు? వెంటనే టీమ్‌లను ఏర్పాటు చేసి వారిని పట్టుకున్నారు. విశాఖపట్నంలోని క్వీన్ మేరీ హైస్కూల్ లో పదో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థినులు అదృశ్యం అయ్యారు. రోజూలాగే బడికి వెళ్లిన అమ్మాయిలు సాయంత్రం దాటినా ఇంటికి రాకపోవడంతో వారి తల్లిదండ్రులు వెతకడం ప్రారంభించారు. స్నేహితులు, తెలిసిన వాళ్లందరికీ ఫోన్ చేసినా ఎలాంటి ఉపయోగమూ లేకుండా పోయింది. దీంతో ముందుగా పాఠశాల యాజమన్యానికి విషయం తెలియజేశారు. అయితే అదృశ్యం అయింది మొత్తం నలుగురు విద్యార్థినులు అని తల్లిదండ్రులు తెలుసుకున్నారు. వీరంతా కలిసి పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. తమ కూతుళ్లు కనిపించడం లేదని.. వెంటనే వాళ్లని వెతికి పట్టుకోవాలంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా ముందుగా పోలీసులు పాఠశాలకు వెళ్లారు. వాళ్లకు అక్కడ విద్యార్థినులు రాసిన ఓ లేఖ లభ్యం అయింది. అందులో ఆ విద్యార్థులు తమ జీవితాల కోసమే మాత్రమే తాము దూరంగా వెళ్లిపోతున్నట్లు తెలిపారు. మేము ఎవరితో వెళ్లట్లేదు.. మాకోసం, మా జీవితాలు బాగయ్యేందు కోసం మాత్రమే వెళ్తున్నామని ఈ లేఖలో పేర్కొన్నారు. ఈ కేసును ఛాలెంజింగ్ గా తీసుకున్న పోలీసులు మిస్టరీని ఛేదించే పనిలో పడ్డారు. ఇప్పటికే అన్ని పోలీసు గ్రూపులను, వాలంటరి గ్రూపులను అలర్ట్ చేశారు. అమ్మాయిల జాడ కనిపిస్తే వెంటనే తెలపాలని పేర్కొన్నారు. వన్ టౌన్ పోలీసులు వద్ద ఉన్న సీసీ కెమెరా వీడియోలో నలుగురు విద్యార్థినులు స్వచ్ఛందంగా వెళ్ళినట్టు ఆధారాలు సైతం ఉన్నాయని స్థానిక సీఐ వెల్లడించారు. క్వీన్ మేరీ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు చదువు ఒత్తిడి తట్టుకోలేక, సినిమాలు, యూట్యూట్ వీడియోలు ప్రభావంతోనే ఇంటి నుంచి వెళ్లిపోయి ఉంటారని పోలీసులు చెబుతున్నారు.


# చదవాలంటే కాలువ దాటాల్సిందే

పాడేరు ఏజెన్సీ అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం పెదవలస పంచాయతీలో గల పిల్లి గొంది గ్రామంలో సుమారు 50 సంవత్సరాలు నుండి నివసిస్తున్నారు. పిల్లి గొంది గ్రామంలో పాఠశాల లేదు. దీంతో చదువుకునే పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు, పిల్లి గొంది గ్రామంలో సుమారు 30 మంది పిల్లలు ఉన్న, వీళ్ళందరూ పక్కా గ్రామంలోకి వెళ్లి చదువుకుంటున్నారు. పాఠశాల కు వచ్చి వెళ్లే క్రమం లో పిల్లలు వెళ్లే మార్గం మధ్యలో పెద్ద కాలువ దాటాలసి వస్తుంది, దీనివల్ల తల్లిదండ్రులు తీవ్ర భయభ్రాంతులకు గురౌతున్నారు. పాఠశాల కు పిల్లలు వెళ్లేటప్పుడు వచ్చేటప్పుడు ఎలా వస్తారని తల్లిదండ్రులు తీవ్ర అవేదన చెందుతున్నారు. వర్ష కాలం అయితే కాలువ పొంగి ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి అదే రహదారిన నిత్యవసర సరుకులు కూడా తెచ్చుకోలేని పరిస్థితి అంటూ పిల్లి గొంది గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి మా గ్రామానికి వంతెన పిల్లలకు పాఠశాల నిర్మించాలని ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్, పిఓ లకు తెలియజేస్తున్నాము అని తెలిపారు. ఈ సమస్య దగ్గరుండి చూసిన జీకే ఇది వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనందరావు చలించిపోయారు, ఈ సమస్య వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు, అలాగే స్థానిక ఎమ్మెల్యే ఎంపీలకు కలెక్టర్లకు తెలియజేస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డ్ నెంబర్ కుంట త్రినాధ్, ధనుంజయ్, గ్రామ పెద్ద రామారావు, అలాగే వంతల సీతారాం మహిళలు అందరు పాల్గొన్నారు.

# భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్

## -నేడు ఆయన జయంతి..జాతీయ విద్యా దినోత్సవం

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్. ఆయన అసలుపేరు 'మొహియుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలాం' అనేది బిరుదు, 'ఆజాద్' కలంపేరు. ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ లకు 1888 నవంబరు 11 న మక్కాలో జన్మించాడు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు. భారత ప్రభుత్వంలో 11 సంవత్సరాలపాటు విద్యాశాఖామంత్రిగా పనిచేసాడు. ఆయన భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పని చేశారు. నవంబర్ 11న ఆయన జన్మదినం సందర్భంగా మన దేశంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1947 ఆగస్టు 15 నుండి అంటే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 1958 ఫిబ్రవరి 2 వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా సేవలు అందించారు. ఈయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఈయనకు భారతరత్న అవార్డు సైతం ఇచ్చింది. అంతేకాదు ఈయన పేరిట పలు విద్యాసంస్థలు కూడా నెలకొల్పబడ్డాయి. అబుల్ కలాం మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ప్రసిద్ధ జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం సహా భారతదేశం అంతటా వివిధ కళాశాలలు మరియు విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. ఈయన సేవలకు గుర్తుగా 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్ణయించింది. మౌలానా అబుల్ కలాం ఆజాద్ మక్కానగరంలో 1888 నవంబరు 11 న జన్మించాడు. అతని వంశస్థులు బాబర్ రోజుల్లో హేరాత్ (ఆఫ్ఘనిస్తాన్లో ఒక నగరం) కు చెందిన వారు. ఆజాద్ ముస్లిం పండితులు, లేదా మౌలానాల వంశం నుండి వచ్చాడు. అతని తల్లి ఒక అరబ్, షేక్ మహ్మద్ జహీర్ వత్రి, అతని తండ్రి మౌలానా ఖైరుద్దీన్ ఆఫ్ఘన్ మూలాల ఉన్న ఒక బెంగాలీ ముస్లిం. ఖైరుద్దీన్ సిపాయి తిరుగుబాటు సమయంలో భారతదేశం నుండి మక్కా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. 1890 లో అయన తన కుటుంబంతో కలకత్తా వెళ్లాడు. ఆజాద్ సంప్రదాయ ఇస్లామిక్ విద్య అభ్యసించాడు. అతని విద్య ఇంట్లోనే సాగింది. మొదట తండ్రి, పిదప ఉపాధ్యాయులు ఇంట్లోనే బోధించారు. ఆజాద్ మొదట అరబిక్, పెర్షియన్ నేర్చుకున్నాడు. తరువాత తత్వశాస్త్రం, రేఖాగణితం,



గణితం, బీజగణితం అభ్యసించాడు. స్వీయ అధ్యయనం ద్వారా ఇంగ్లీష్, ప్రపంచ చరిత్ర, రాజకీయాలు నేర్చుకున్నాడు. ఆజాద్ మౌలానా అగుటకు కావలసిన మత శిక్షణ పొందాడు. అతను దివ్య ఖురాన్ పై భాష్యం వ్రాసాడు.. అతను జమాలుద్దీన్ ఆఫ్ఘానీ పాన్-ఇస్లామిక్ సిద్ధాంతాలలో, అలిగర్ సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ఆలోచనలో ఆసక్తి చూపేవాడు. పాన్-ఇస్లామిక్ భావాలతో అతను ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, ఈజిప్ట్, సిరియా, టర్కీ సందర్శించాడు. ఇరాక్ లో అతను ఇరాన్ రాజ్యాంగ ప్రభుత్వ స్థాపనకు పోరాటం సల్పుతున్న నిర్వాసిత విప్లవ కారులను కలుసుకున్నాడు. ఈజిప్ట్ లో అతను షేక్ ముహమ్మద్ అబ్దుహ్, సయీద్ పాషా వంటి అరబ్ ప్రపంచంలోని ఇతర విప్లవకారులను కలుసుకున్నారు. అతను కాన్స్టాంటినోపుల్లో యంగ్ టర్క్స్ భావాలతో పరిచయం పెంచుకున్నాడు. ఈ పరిచయాలు అన్ని అతనిని ఒక జాతీయవాద విప్లవవాదిగా రూపాంతరం చెందించాయి. విదేశాల నుంచి తిరిగొచ్చిన అనంతరం ఆజాద్, బెంగాల్ కు చెందిన అరవింద ఘోష్, శ్రీ శ్యాం సుందర్ చక్రవర్తి వంటి ప్రముఖ విప్లవకారులను కలుసుకున్నారు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాన్ని చేపట్టారు. విప్లవాత్మక చర్యలు బెంగాల్, బీహార్ లకు పరిమితం అగుట ఆజాద్ కు తెలిసి రెండు సంవత్సరాల లోపల, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉత్తర భారతదేశం, బాంబే లాంటి ప్రాంతాలలో రహస్య విప్లవ కేంద్రాలు ఏర్పాటుచేసారు. ఆసమయంలో విప్లవ వాదులు ముస్లింల విప్లవ వ్యతిరేకులుగా భావించసాగారు ఎందుకంటే బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి వ్యతిరేకంగా ముస్లిం కమ్యూనిటీని ఉపయోగిస్తుందని భావించాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన సహచరులను ముస్లింల పట్ల వారి పగను పోగొట్టటానికి ప్రయత్నించాడు. 1912 లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూలో ' అల్ హిలాల్' వార పత్రిక ముస్లింల మధ్య విప్లవాత్మక భావాలను పెంచడానికి ప్రారంభించారు. అల్ హిలాల్ మోర్లే-మింటో సంస్కరణల ఫలితంగా రెండు వర్గాల మధ్య చెలరేగిన సంఘర్షణల తర్వాత హిందూ మతం-ముస్లిం వర్గాల మధ్య ఐక్యత కుదుర్చటంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషించింది. 'అల్ హిలాల్' అతివాద భావనల ఒక విప్లవాత్మక ధ్వనిగా మారింది. ప్రభుత్వం వేర్పాటువాద భావనల ప్రచారకునిగా "అల్- హిలాల్"ను భావిస్తింది. ప్రభుత్వం దానిని 1914 లో నిషేధించింది. ఆజాద్ భారతీయ జాతీయ వాదం, హిందూ -ముస్లిం ఐక్యత ఆధారంగా విప్లవాత్మక ఆలోచనలతో మరో పత్రికను "అల్ బలఘ్" ప్రారంభించారు. 1916 లో ప్రభుత్వం ఈ పత్రికను కూడా నిషేధించారు, రాంచిలో ఆజాద్ ను నిర్బందించారు. ఆతరువాత మొదటి ప్రపంచ యుద్ధం 1920 తర్వాత విడుదల చేసారు. విడుదల తరువాత ఆజాద్ ఖిలాఫత్ ఉద్యమం ద్వారా ముస్లిం కమ్యూనిటీలో బ్రిటిష్ వ్యతిరేక భావాలు పెంచారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ గాంధీజీ ప్రారంభించిన "సహాయ నిరాకరణ" ఉద్యమం ను సమర్థించి 1920 లో భారత జాతీయ కాంగ్రెస్ లో చేరాడు. ఇతడు ఢిల్లీ కాంగ్రెస్ ప్రత్యేక సెషన్ అధ్యక్షుడు గా (1923) ఎన్నికయ్యాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1940 (రాంగఢ్) లో కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు , 1946 వరకు ఆ పదవిలో ఉన్నాడు. అతను విభజనకు వ్యతిరేకి. విభజన అతని కలలను నాశనం చేసింది. హిందువులు , ముస్లింలు కలసి సహజీవనం చేస్తున్న ఒక ఏకీకృత దేశం బద్దలు అగుట అతని కలను నాశనం చేసి అతనిని విపరీతంగా బాధించింది. మౌలానా ఆజాద్ గాంధీజీ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1930 లో అరెస్టు అయ్యాడు. అతనిని ఒక సంవత్సరంన్నర పాటు మీరట్ జైల్లో ఉంచారు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు. 1958 ఫిబ్రవరి 22 న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ మరణించాడు. గాంధీజీ ఇతడిని భారత ప్లాటో అని, గాంధీ , నెహ్రూ ఇతడిని మౌలానా, మీర్-ఎ-కారవాన్ అని పిలిచేవాడు. భారత ప్రభుత్వం ఆయన మరణానంతరం 1992లో అతనికి భారతరత్న ఇచ్చి గౌరవించింది.

# ఆటోను ఢీ కొట్టిన అంబులెన్స్

## పదిమందికి గాయాలు

## ముగ్గురు పరిస్థితి విషమం

తిరుపతికేఎల్ పురం రైల్వే బ్రిడ్జి సమీపంలో గురువారం ఉదయం ఆటోను వెనుక నుండి వస్తున్న ప్రైవేట్ అంబులెన్స్ ఢీ కొట్టిన సంఘటనలో పదిమంది గాయపడ్డారు. బొండపల్లి మండలం గొట్లం గ్రామానికి చెందిన మజ్జి సూర్య నారాయణ, దొంతల జమ్మన్న,గెద్ద రమణ,చిల్ల శ్రీను, అలమండ రమణ,సాసిబిల్లి అప్పారావు, కోరాడ అచ్చిరాజు,మీసాల నారాయణరావు, బొబ్బిలికి చెందిన మాడిస చైతన్య తో పాటు అంబాటివలస గ్రామానికి చెందిన పీతల రాంబాబు గుడ్ షెడ్ వ్యాగన్ కలాస పనులకు వెళుతుండగా జైపూర్ నుంచి విశాఖ వెళ్తున్న ప్రైవేట్ అంబులెన్స్ వెనుక నుంచి ఢీ కొట్టడంతో వీరు గాయపడ్డారు. గాయపడ్డ క్షతగాత్రులను చికిత్స కోసం అదే అంబులెన్స్లో జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించారు. వీరిలో సాసబిల్లి అప్పారావు, కోరాడ అచ్చిరాజు, మీసాల నారాయణరావుని పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుమల మేడికవర్ ఆసుపత్రికి తరలించారు. ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అటవీ శాఖ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి కలెక్టర్ వి. విజయ్ రామరాజు




కడప నవంబర్ 10: పర్యావరణ సమతుల్యం లో అడవులు ప్రముఖ పాత్ర పోషిస్తాయని, వాటిని రక్షించడంలో అటవీ శాఖ అధికారుల సేవలు ఎనలేనివని జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు కొనియాడారు. గురువారం జిల్లా అటవీ అధికారి కార్యాలయంలో రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు హాజరుకాగా ఆయనతో పాటు జిల్లా ఎస్పీ అన్బురాజన్, జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ, నగర మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్,శిక్షణా కలెక్టర్ రాహుల్ మీనా, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి ,అడిషనల్ ఎస్పీ తుషార్ డూడి,సోషల్ ఫారెస్ట్ డిఎఫ్ఓ నాగార్జున రెడ్డి, స్క్వాడ్ డిఎఫ్ఓ గురు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్మాట్లాడుతూ....రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అడవుల విస్తీర్ణంలో అధిక శాతం వైఎస్ఆర్ జిల్లా ఆక్రమిస్తుందని, ఇందులో వివిధ రకాల పక్షులు,జంతువులు జీవా వాసం పొందడం ఇక్కడ ప్రత్యేకత అని తెలిపారు. అడవులను సంరక్షించుకోవడంలో అటవీ శాఖ ఉద్యోగులు ప్రధాన భూమిక పోషిస్తున్నారని అన్నారు. . విధి నిర్వహణలో ప్రాణ త్యాగాలు చేసిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని తెలిపారు. అటవీ శాఖ లో పనిచేసే ఉద్యోగులకు ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయని సేఫ్టీ మెజర్స్ పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. అడవి వ్యవస్థపై అవగాహన కలిగి విధుల నిర్వహణలో నేటి సాంకేతికతను వినియోగించుకొని జాగ్రత్తగా, అప్రమత్తంగా గా పని చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ అన్బు రాజన్ మాట్లాడుతూ....భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ శాఖ అధికారులకు అమరవీరుల దినోత్సవ సందర్భంగా నివాళులర్పించడం వారి కుటుంబాలకు గౌరవం కల్పించడమేనన్నారు. అటవీ శాఖకు పోలీస్ శాఖ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు..డిఎఫ్ఓ సందీప్ రెడ్డి మట్లాడుతూ...అడవులు, వన్యప్రాణులను రక్షించడం,పర్యావరణ పరిరక్షణ కల్పించడం మనందరీ బాధ్యతన్నారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను కోల్పోయిన అధికారుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ నివాళులర్పించేందుకు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఫారెస్ట్ రేంజర్లు,ఇతర అధికారులు అడవులను, వన్యప్రాణులను రక్షించడానికి రాత్రి బగళ్లు శ్రమిస్తున్నారు. అనంతరం అమరవీరుల జ్ఞాపకాలను స్మరించుకుంటూ.... విధి నిర్వహణ లో ఎర్ర చందనం స్మగర్ల చేతిలో ప్రాణాలు కోల్పోయిన బి.అశోక్ కుమార్(ప్రొటెక్షన్ వాచర్ )తల్లి భానుమతి ని జిల్లా కలెక్టర్ . విజయ్ రామరాజు సత్కరించారు. అంతకుముందు అటవీ శాఖ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు పుష్ప గుచ్ఛం ఉంచి జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్పీ అన్బు రాజన్, తదితర అధికారులు నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరుల సంస్మరణకు ప్రతీకగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ అధికారులు,ఫారెస్ట్ రేంజ్ అధికారులు,బీట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ఎందుకీ డ్రామాలు

విజయవాడ, నవంబర్ 10,ఏపీలో వైసీపీ వర్సెస్ జనసేన ఎపిసోడ్ నడుస్తోంది. మా ప్రభుత్వం మీద, పేదల ఇళ్ల నిర్మాణంపై విపక్షాలు, కొన్ని పత్రికలు దుష్ప్రచారం చేస్తున్నాయని మంత్రి జోగి రమేష్ మండిపడ్డారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు అందించామని, ఫేస్?1, ఫేస్?2 కింద 21 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడితే రామోజీరావుకు కళ్లు కనిపించడం లేదా..? అని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రశ్నించారు. పేదల ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతుంటే.. ప్రభుత్వంపై బురదజల్లేలా వుందన్నారు. 'మాకు ఎవరి సానుభూతి అక్కర్లేదు.. మా ఇళ్ళు కూల్చలేదు' అనే పోస్టర్లు వెలసినా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అవేం పట్టించుకోవడం లేదన్నారు మంత్రి జోగి రమేష్. ఇప్పటంలో

వెలసిన బోర్డులను మంత్రి జోగి రమేష్ ప్రస్తావించారు. ఎక్కడ డ్రామాలంటూ మంత్రి జోగి రమేష్ మండిపడ్డారు. మాకు అన్యాయం జరగలేదు. మీరు రావద్దంటూ ఇప్పటంలో బోర్డులు కనిపిస్తున్నాయి. ఒక రైతుకి సంబంధించిన ఇళ్ల నిర్మాణంలో చిన్న ప్రహరీ గోడ పాడైందన్నారు. ఇదిలా వుంటే.. ఈ నెల 12, 13, 14 తేదీల్లో 'జగనన్న ఇళ్లు ? పేదలందరికీ కన్నీళ్లు' పేరుతో కార్యక్రమం నిర్వహిస్తోంది జనసేన పార్టీ. ఏజీజజీజినిజీనిజిజీఓనీబజీఏ హ్యాష్ ట్యాగ్ తో ఫోటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయాలని, ప్రభుత్వ అవినీతి, నిర్లక్ష్యాన్ని ప్రపంచానికి చూపిద్దాం అంటున్నారు జనసేన నేతలు. రాష్ట్రంలోనే అతి పెద్ద స్కాం జగనన్న కాలనీలు.. అధికార పార్టీ నాయకులు కోట్లు దోచుకున్నారని జనసేన నేత నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంపై వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటంలో ఇళ్ళు కూల్చివేతకు గురైన వారికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు పవన్ కళ్యాణ్.

# రెండు బస్సు ప్రమాదాలు..ప్రయాణికులు సురక్షితం

ప్రకాశం ప్రకాశం జిల్లా సింగరాయకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ వద్ద శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపం దగ్గర్లో అర్ధరాత్రి సుమారు రెండు గంటలు టైం లో రెండు బస్సు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. విజయవాడ నుండి తిరుపతి వెళుతున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు లో డ్రైవర్ నిద్ర మత్తులో వుండడంతో అదుపుతప్పి ఒంగోలు వైపు డివైడర్ ఎక్కి బస్సు ఆగిపోయింది . ఈ బస్సు లో తొమ్మిదిమంది మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రయాణికులను వేరే బ స్సులో తిరుపతి కి పంపించారు. మరో ఘటనలో చెన్నై నుండి హైదరాబాద్ వెళ్తున్న తులసి ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి నెల్లూరు రూటు వైపు వచ్చి బోల్తా పడింది. ఈ బస్సు లో 22 మంది ప్రయాణికులు ఉన్నారు.

# మేరీ ల్యాండ్ స్వగ్రామంలో సంబరాలు

విజయవాడ, నవంబర్ 10,అమెరికా మేరీలాండ్ లెఫ్ట్ నెంట్ గవర్నర్‌గా కాట్రగడ్డ అరుణ మిల్లర్ ఘనవిజయం సాధించడంతో ఆమె గ్రామంలో సంబరాలు చేసుకుంటున్నారు. కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలం వెంట్రపగడ గ్రామానికి చెందిన కాట్రగడ్డ అరుణ మిల్లర్ స్వస్థలం. అగ్రరాజ్యం అమెరికాలో లెఫ్ట్ నెంట్ గవర్నర్ గా అరుణ విజయం సాధించడంతో వెంట్రప్రగడ గ్రామంలో బంధువులు, గ్రామస్తులు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసిన గ్రామస్తులు, బంధువులు మిఠాయిలు తినిపించుకుంటు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అగ్ర రాజ్యంలో అరుణ అరుదైన గౌరవం సాధించడం తమకు ఎంతో గర్వంగా ఉందని, అరుణ విజయంతో మారుమూల గ్రామమైన వెంట్రప్రగడకు ఎంతో పేరు వచ్చిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మేరీ ల్యాండ్ లో ఫైర్ బ్రాండ్ గా గుర్తింపు పొందిన అరుణ బాలలందరికి విద్య, మహిళలకు సమాన అవకాశాలపై అరుణ చేసిన కృషికి అక్కడి ప్రజలు పట్టడం కట్టారని అరుణ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఇండియా అంటే ఆమెకు ఎంతో ఇష్టమని, వెంట్రప్రగడ వచ్చినప్పుడు గ్రామంలో అనేక సేవా కార్యక్రమాల్లో ఆమె పాల్గొనేదని గ్రామ పెద్దలు తెలిపారు. తమ గ్రామానికి పేరు తెచ్చిన అరుణ మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. అరుణా మిల్లర్‌లో, ఆమె తండ్రితో ఆమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ గ్రామస్థులు .. అరుణ సేవా గుణమే ఈ స్థాయికి చేర్చిందని ప్రశంసించారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటున్నారు. అమెరికాలో ఉంటున్నా అరుణా మిల్లర్ మన సాంస్కృతి సాంప్రదాయాలను మరచిపోలేదని వెంట్రపగడ గ్రామస్తులు అంటున్నారు.

# ఏపీ విభజన హామీ చట్టాలను అమలుపరిచి రాష్ట్రంలో ప్రధాని అడుగు పెట్టాలి



## విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ను ఆపకపోతే రాష్ట్ర ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవలసి వస్తుంది.., ఏపీ సి సి అధికార ప్రతినిధి షేక్ సైదా

బద్వేలు ,రాష్ట్ర విభజన జరిగి దాదాపు 8 సంవత్సరాలు పూర్తి అయినపార్లమెంట్ సాక్షిగా చేసిన చట్టాలను అమలుపరచకుండా ఉద్దేశపూర్వకంగా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఏ ముఖం పెట్టుకొని విశాఖ వస్తున్నారో చెప్పాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నేడు పొదిలిలో జరిగిన విలేకరుల సమావేశంలో బిజెపి ప్రభుత్వం విధానాలను తీవ్రంగా విమర్శించారు.గత 600 రోజులుగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున చేస్తున్న ఉద్యమాల పట్ల ప్రధాని మోడీ స్పందించకపోవడం దురదృష్టకరమని, మోడీ మెడలు వంచుతామని ప్రగల్ బాలు పలికిన జగన్ పార్టీ నాయకులు ఆ విషయం మరిచి ప్రధానమంత్రి కి మోకరిల్లి నిస్సిగ్గుగా మోడీ పర్యటనకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారని, విశాఖ ఉక్కు, రైల్వే జోన్ కోసం మంత్రి పదవులు, ఎంపీ ,ఎమ్మెల్యేల పదవులకు రాజీనామా చేస్తామన్న అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు నోరు మెదపకుండా మూడు రాజధానులకు అనుకూలంగా రాజీనామాలు చేస్తామని జగన్ పార్టీ మంత్రులు ,ఎమ్మెల్యేలు డ్రామాలు ఆడటం సిగ్గుచేటని సైదా తీవ్రంగా విమర్శించారు.విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినాదంతో 32 మంది బలిదానాలతో సాధించుకున్న విశాఖకు ప్రైవేటీకరణ జరగకుండా ఆపవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వాన్ని దేనని ,అలాగే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి విశాఖ ఉక్కును కాపాడాలని సైదా అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటేకరణ వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తున్న వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులను, ఉద్యోగ సంఘాల నాయకులను పోలీసు తో బలవంతంగాఅరెస్టు చేయించడం దుర్మార్గమైన చర్యని ఆయన తీవ్రంగా విమర్శించారు. జగన్ ప్రతిపక్షంలో ఉండగా తనకు 25 ఎంపీ సీట్లు ఇస్తే ప్రధాని మోడీ మెడలు వంచి ఏపీకి ప్రత్యేక హోదా సాధిస్తానని ప్రగల్బాల్ పలికి, ఇప్పుడు కిక్కురు మన కొంద ఉండడంలో ఆంతర్యం ఏమిటనే సైదా సూటిగా ప్రశ్నించారు.స్వయానా మోడీ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిన అమరావతి రాజధానికి రాష్ట్ర ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందని, గత 1059 రోజులుగారాజధానికి భూములు ఇచ్చిన రైతులు, మహిళలు,రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుంటే జగన్ ప్రభుత్వం పోలీసులు ఉక్కు పాదంతో అణచి వేస్తుందని ఈ విషయమై ప్రధాని నోరు తెరిచి మాట్లాడి తన ప్రధాన పదవికి వన్నె తేవాలని లేనిపక్షంలో దేశ చరిత్రలో మోడీ చరిత్రహీనుడుగా మిగిలిపోతారని సైదా ధ్వజమెత్తారు...

# పూర్తి బాధ్యతలు చేపట్టిన డీయస్పీ మహేశ్వర రెడ్డి

నంద్యాల :-నంద్యాల టౌన్ డిఎస్పీ గా పూర్తి బాధ్యత చేపట్టిన అ.మహేశ్వర్ రెడ్డి. నంద్యాల టౌన్ ఇన్చార్జి డి.ఎస్.పి గా కొంతకాలంగా పనిచేస్తున్న సి . మహేశ్వర్ రెడ్డి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు చేసిన బదిలీల్లో పూర్తి బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా డి.ఎస్.పి మహేశ్వర్ రెడ్డి గురువారం జిల్లా ఎస్పీ గారిని మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం డి.ఎస్.పి కార్యాలయంలో పూర్తి బాధ్యతలు స్వీకరించిన డీయస్పీ. సి మహేశ్వర రెడ్డి.



# విద్య,ఉపాధి హక్కులకై నవంబర్ 25న చలో ఢిల్లీ విజయవంతం చేయండి

కౌతాళం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని,జాతీయ నూతన విద్యవిధానాన్ని రద్దు చేయాలని,దేశంలో వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నవంబర్ 25న ఢిల్లీలో జరిగే చలో పార్లమెంట్ మార్చ్ ను జయప్రదం చేయాలని కోరుతూ కౌతాళం మండల ముఖ్య నాయకుల సమావేశం జూనియర్ కళాశాలలో జరిగింది. ఈ సమావేశానుద్దేశించి ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు థామస్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్ట ప్రకారం మన రాష్ట్రంలో 11 జాతీయ విద్యా సంస్థలను రాష్ట్రంలో ప్రారంభించినప్పటికి నిధులు కేటాయించకపోవడం వలన అవి మొండి గోడలకే పరిమితమయ్యాయి అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మూడు 3,4,5 తరగతులను హై స్కూల్స్ లలో విలీనం చేయడం వలన రవాణా సౌకర్యం లేక విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేక డ్రాప్ అవుట్ అవుతున్నారన్నారు.రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న వసతి దీవెన, విద్యా దీవెన, స్కాలర్షిప్ రెయిన్బర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు.విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ తరుణంలో ఉపాధి హక్కులను కల్పించడానికి భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ బిల్లును తీసుకురావడానికి, నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా కాషాయకరణ,విద్యా ప్రైవేటీకరణకు జరుగుతున్న కుట్రలను తిప్పి కొట్టడానికి ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ కోసం నూతన జాతీయ విద్యా విధానం 2020 బిల్లును రద్దు చేయాలని,ప్రతి ఏటా 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వడం పక్కన పెట్టి ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెబుతు ఉన్న ఉద్యోగాలనే ఉడగొడుతున్నారని,కావున భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ ను అమలు చేసి కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.కావున ఈ సమస్యల పరిష్కారానికై ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఈ నెల 25 న ఢిల్లీలో జరిగే చలో పార్లమెంట్ మార్చ్ లో విద్యార్థి,యువజన లోకం, పెద్ద ఎత్తున పాల్గొని ఈ మహా ధర్నా లో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు కుమార్, వీరేష్, మహేష్, గురు, మంజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బిజాపూర్ మహానంది అక్రమంగా నిర్మించిన బిల్డింగ్ ను పడగొట్టాలని కర్నూల్ డీపీఓ కు వినతిపత్రం

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పురుషోత్తంరెడ్డి తెలపడం జరిగింది కర్నూలు డిపిఓ త్వరలోనే బిల్డింగ్ ను కూల్చివేస్తామని హామీ ఇవ్వడం జరిగింది

కౌతాళం ఉదయం న్యూస్;అక్రమంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను,బిల్డింగ్ను పడగొట్టాలని ఎనిమిది నెలల క్రిందటే హైకోర్టు ఆర్డర్స్ పాస్ చేయడం జరిగిందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ అన్నారు. కౌతాళం మండల కేంద్రంలో బీజాపూర్ మహానంది బ/నీ తాయప్ప అక్రమంగా



రోడ్డును ఆక్రమించి బిల్డింగ్ ను కట్టడం జరిగింది అని ఈ బిల్డింగ్ ను కూల్చివేయాలని మారుతి హైకోర్టులో కేసు ఫైల్ చేయడం జరిగిందిని హైకోర్టు కూడా స్పందిస్తూ అక్రమంగా నిర్మించిన బిల్డింగ్ ను కూల్చి వేయాలని హైకోర్టు ఆర్డర్స్ పాస్ చేయడం జరిగిందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు హైకోర్టు సీనియర్ అడ్వకేట్ పురుషోత్తం రెడ్డి అన్నారు.గురువారం కర్నూల్ డిస్ట్రిక్ పంచాయితీరాజ్ ఆఫీసర్ కి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు హైకోర్టు సీనియర్ అడ్వొకేట్ పురుషోత్తంరెడ్డి మరియు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ మరియు మారుతి డిపీఓ కి అక్రమంగా నిర్మించిన బిల్డింగ్ ను పడగొట్టాలని చెప్పడం జరిగింది డీపీవో కూడా స్పందిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్స్ ను త్వరలోనే ఇంప్లిమెంట్ చేస్తామని బిల్డింగ్ ని కూడా కూల్చివేస్తామని హామీ ఇవ్వడం జరిగింది అని అన్నారు అదేవిధంగా హైకోర్టు ఆర్డర్స్ ఇచ్చి దాదాపుగా ఎనిమిది నెలలు కావొస్తున్నా సరే అధికారులు ఇన్చార్జ్ ఎంపీడీవో జగన్ మోహన్ రెడ్డి మరియు పంచాయతీ సెక్రటరీ నవీన్ కుమార్, కౌతాళం మేజర్ సర్పంచ్ ఇప్పటివరకు ఈ యొక్క ఆర్డర్స్ ను ఇంప్లిమెంట్ చేయలేకపోయినందున వీరిపై హైకోర్టులో కంటెంట్ కింద కేసు ఫైల్ చేస్తామని పురుషోత్తమ రెడ్డి అన్నారు.గురువారం డీపీఓ కి పురుషోత్తంరెడ్డి సీరియస్ గా చెప్పడం జరిగింది బిల్డింగ్ను కూల్చివేయకుండా హైకోర్టు ఆర్డర్స్ ను తప్పుదోవ పట్టించిన అధికారులపై హైకోర్టు సీరియస్ గా యాక్షన్ తీసుకుంటుందని వీరిపై చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు హైకోర్టు సీనియర్ అడ్వకేట్ పురుషోత్తంరెడ్డి మరియు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ అన్నారు.

# 11న విడుదలవుతున్న యశోద

## లేడీ సూపర్ స్టార్ అంటూ సమంతపై కామెంట్స్




మొన్నటి వరకు లేడి సూపర్ స్టార్ గా అనుష్కశెట్టి ని అనేవారు. ఇప్పుడు ఆమె ప్లేస్ లో సమంత లేడీ సూపర్ స్టార్ గా రాబోతోంది. సమంత నటించిన 'యశోద' ఈ శుక్రవారం విడుదల అవుతోంది. ఈ సినిమా కథ అంతా సమంత చుట్టూ తిరుగుతూ వుంటుంది, ఇందులో లీడ్ యాక్టర్ అంటూ ఎవరూ లేరు. ఈ సినిమా బ్జడెట్ కూడా ఒక స్టార్ యాక్టర్ కి ఎంత పెడతారో అలా పెట్టారు అని తెలిసింది. ఈ సినిమాకి అయ్యే బ్జడెట్ ఎంతో తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. సుమారు 40 కోట్లు పైన అయింది ఈ సినిమా బ్జడెట్. అలాగే కేవలం సమంత వున్నందు వల్లనే ఈ సినిమా కి అంత క్రేజ్ కూడా వచ్చి, అన్ని బాషలలో పాన్ ఇండియా సినిమాగా విడుదల చేస్తున్నారు. 40 కోట్ల యశోద, లేడీ సూపర్ స్టార్ సమంతకానీ విడుదలకి ముందే నిర్మాత శివలెంక ప్రసాద్ కి లాభాలు వచ్చాయని కూడా అంటున్నారు. శాటిలైట్, ఓ.టి.టి. హక్కుల ద్వారా ఈ సినిమాకి మంచి లాభాలు వచ్చాయని తెలిసింది. ఇప్పుడు ధియేటరికల్ విడుదల పరంగా వచ్చే డబ్బు అంతా బోనస్ అని అంటున్నారు. దీన్ని బట్టి చూస్తే సమంత లేడీ సూపర్ స్టార్ కదా! 40 కోట్లు ఆమె మీద పెట్టడమే కాకుండా, విడుదలకి ముందే ఆ డబ్బులు సొంతం చేసుకున్నారు అంటే, కేవలం సమంత వుంది కాబట్టే. ఇప్పుడు పెద్ద స్టార్స్ తప్పితే, వేరే ఎవరి మీద అంత డబ్బు పెట్టడం లేదు, అంత డబ్బు రావటం లేదు కూడా. ఈ సినిమా తెలుగులోనే కాకుండా, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ లో విడుదల అవుతోంది. ట్రైలర్ తో విశేషమయిన క్రేజ్ వచ్చింది ఈ సినిమాకి. హరి మరియి హరీష్ దర్శకులు ఈ సినిమాకి. పెద్ద పెద్ద కట్ ఔట్స్ కూడా థియేటర్స్ దగ్గర, స్టార్ హీరో లకి ఎలా పెడతారో సమంత కి కూడా అలానే పెట్టారు. లేడీ సూపర్ స్టార్ సమంత!







# ఇంతకాలం ఓపిక పట్టాను

## ఇక ట్రోల్ చేసే వారిని వదలబోన్న రష్మిక



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న చాలా రోజుల తర్వాత తన ఇన్ స్టాగ్రామ్ లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. కొన్ని రోజులు, నెలలు, ఇప్పుడు సంవత్సరాలుగా తనను ఇబ్బంది పెడుతున్న విషయాల గురించి రష్మిక మందన్న నోరు విప్పారు. తనను ట్రోల్ చేస్తున్న వారిని ఉద్దేశించి ఆమె ఈ పోస్టును రాశారు. ఇప్పటివరకు ఎవరు ఎన్ని ట్రోల్స్ చేసిన భరించాను ఇకపై నాకు అంత ఓపిక లేదని చెప్పారు. కొందరు చేస్తున్న ట్రోల్స్ తనను నిరుత్సాహ పరిచే విధంగా ఉన్నాయని.. గుండె బద్దలు అయ్యేలా నెగిటివిటీ వ్యాప్తి చేస్తున్నారని రష్మిక ఆవేదన వ్యక్తం చేశారు. కెరీర్ స్టార్ట్ చేసినప్పటి నుంచి కొందరు తనపై విషం చిమ్ముతున్నారని.. ఆవేదన చెందారు. ట్రోల్స్ చేసేవాళ్ళు, నెగిటివిటీ స్ప్రెడ్ చేసేవాళ్ళకు తానొక పంచింగ్ బ్యాగ్ కింద మారినట్టు ఆవిడ చెప్పుకొచ్చారు. ప్రతి ఒక్కరూ తనను ఇష్టపడాలని తాను ఆశించడం లేదని, నటిగా ఉన్నప్పుడు కొన్ని కొన్ని విమర్శలు వస్తాయనేది తనకు తెలుసని, దాని అర్థం ద్వేషించమని కాదని రష్మిక స్పష్టం చేశారు. తన అభిమానులను.. గర్వపడేలా చేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తానని అన్నారుకొందరు తాను చెప్పని విషయాలను కూడా చెప్పినట్లు ప్రచారం చేస్తున్నారని.. తనను టార్గెట్ చూస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని అన్నారు. వాటిని చూసి తాను తట్టుకోలేక.. నిరుత్సాహానికి గురవుతున్నట్లు తెలిపారు. కొన్ని ఇంటర్వ్యూలలో తాను చెప్పిన విషయాలు తనకు వ్యతిరేకంగా మారాయన్నారు. సినిమా ఇండస్ట్రీ బయట తన రిలేషన్షిప్స్‌కు హాని కలిగించే విధంగా తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని రష్మిక పేర్కొన్నారు. తనను మెరుగు పరుచుకునేలా వచ్చే విమర్శలను తాను స్వాగతిస్తానని తెలిపారు. చాలా రోజులుగా తాను విమర్శలను విస్మరిస్తూ వస్తున్నానని... అయితే రోజు రోజుకూ వరస్ట్ అవుతోందని రష్మిక వివరించారు.

# ఫైనల్లో టీమిండియాతో పోరుకు సిద్ధమేనా? పాక్ కెప్టెన్ ఏమన్నాడంటే

టీ20 ప్రపంచకప్-2022 మొదటి సెమీ ఫైనల్లో న్యూజిలాండ్‌ను ఓడించిన పాకిస్తాన్ ఫైనల్‌కు సన్నద్ధమవుతోంది.కివీస్‌తో కీలక మ్యాచ్‌లో తిరిగి ఫామ్ అందుకున్న బాబర్ ఆజం.. 53 పరుగులతో రాణించాడు. ఈ ఓపెనింగ్ బ్యాటర్‌తో పాటు మరో ఓపెనర్ మహ్మద్ రిజ్వాన్ సైతం 57 పరుగులతో మెరిశాడు. గత మ్యాచ్‌లలో అంతగా ఆకట్టుకోని ఈ ఓపెనింగ్‌జోడీ చావో రేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో మాత్రంఅదరగొట్టడం గమనార్హం.ఇదిలా ఉంటే.. పాకిస్తాన్ ఫైనల్ చేరడంతో.. రెండో సెమీ ఫైనల్లో టీమిండియా ఇంగ్లండ్‌ను ఓడించి పాక్‌తో పాటు తుది మెట్టుకు చేరుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. 2007 నాటి వరల్డ్‌కప్ మాదిరి ఫైనల్లో దాయాదుల హోరాహోరీ పోరును చూడాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఈ నేపథ్యంలో కివీస్‌తో మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడిన పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజంకు ఓ జర్నలిస్టు నుంచి ఆసక్తికర ప్రశ్న ఎదురైంది.

జర్నలిస్టు:మీరు తిరిగి పుంజుకున్న తీరు అమోఘం. అయితే, ఫైనల్లో ఇండియా మీ ప్రత్యర్థిగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సాధారణంగా ఇండియా- పాక్ మ్యాచ్ అంటే అంతా ఒత్తిడిలో కూరుకుపోతారు. అలాంటి పరిస్థితుల్లో మీరెలాంటి వ్యూహాలు అవలంబిస్తారు?

బాబర్ ఆజం:నిజానికి ఫైనల్లో మా ప్రత్యర్థి ఎవరో ఇప్పుడే చెప్పలేం కదా. అయితే, తుది పోరులో ఎవరితో పోటీ పడాల్సి వచ్చినా వందకు వంద శాతం మా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచేందుకే ప్రయత్నిస్తాం. సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగుతాం. ఫైనల్లో ఒత్తిడి సహజమే.అయితే, ఈ టోర్నీ ఆరంభం నుంచి ఫైనల్ చేరే వరకు వివిధ దశల్లో కఠిన పరిస్థితులు దాటుకుని ఇక్కడి దాకా వచ్చాం. ఫైనల్లో కచ్చితంగా భయానికి తావులేకుండా దూకుడుగా ఆడాల్సి ఉంటుంది. గత మూడు, నాలుగు మ్యాచ్‌లలో మా ఆట తీరు అలాగే ఉంది. ఫైనల్లో కూడా అదే విధంగా ఆడతాం అంటూ బాబర్? ఆజం సమాధానమిచ్చాడు.ఈ నేపథ్యంలో పాక్ కెప్టెన్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇందుకు స్పందించిన నెటిజన్లు.. "లక్‌తో మీరు సెమీస్ వరకు రాగలిగారు. కివీస్ వైఫల్యం కారణంగా ఫైనల్‌కు చేరుకున్నారు. టీమిండియా అలా కాదు కదా! కష్టపడి ఇక్కడి దాకా వచ్చారు. ఫైనల్‌కు చేరుకుంటారు. రెడీగా ఉండండి" అంటూ కామెంట్లు చేస్తున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190